

విలీన వార్డుల్లో సమస్యల తిష్ఠ
- పారిశుధ్యం, అభివృద్ధిని పట్టించుకోని అధికారులు 8

గని కార్మికుల సమస్యలపై
బీఎంఎస్ ఆందోళనలు 8



'స్థానిక' ఎన్నికల్లో

పెరగనున్న బీసీ రిజర్వేషన్లు

- నెలాఖరులోగా బీసీ కమిషన్ నియామకం
- ఆ తర్వాత ప్రారంభం కానున్న బీసీ గణన
- ఈనెల 21న ఓటర్ల తుది జాబితా ప్రకటన

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ల శాతం పెరగనున్నది. బీసీ గణన పూర్తయిన తర్వాతనే ఆ మేరకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపక్ష పార్టీలతో పాటు బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీసీ గణన పూర్తయిన తర్వాతనే ఎన్నికలు జరిగే అవకాశాలు కనబడుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని, బీసీ గణన చేపడతామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో గ్రామపంచాయతీ ఎన్నికలను చేపట్ట లేదు. బీసీ గణన చేపట్టేందుకు అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతో సభ ఆమోదం పొందింది. బీసీ గణన బీసీ కమిషన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సి రావడంతో కొత్త కమిషన్ నియమించే వరకు బీసీ గణన మొదలు కాలేదు. ఈలోపు కనీసం పాత రిజర్వేషన్లతో పంచాయతీ ఎన్నికలనైనా నిర్వహించాలని ప్రభుత్వం ప్రయత్నించినప్పటికీ, బీసీ గణన పూర్తి చేసిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ మొదలయ్యింది. బీసీ కమిషన్ పదవీకాలం ఆగస్టు నెలాఖరుతో ముగియడంతో ఈనెలాఖరులోగా ప్రభుత్వం కొత్త కమిషన్‌ను నియమించనున్నది. ఆ వెంటనే బీసీ గణనకు కసరత్తు చేపట్టి ఆ కార్యక్రమాన్ని ప్రారంభించే అవకాశాలున్నాయి. రెండు మాసాల్లో బీసీ గణన పూర్తిచేయాలనే పట్టుదలతో ప్రభుత్వం ఉంది. ఆ తర్వాత డేటాను క్రోడీకరించిన తర్వాత వాటి ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లు పెంచి ఎన్నికలను నిర్వహించనున్నారని ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. 2019 జనవరిలో పంచాయతీ ఎన్నికలు జరగగా, ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీతో పదవీ కాలం ముగిసింది.

● జిల్లాలో 263 గ్రామ పంచాయతీలు..

జిల్లాలో 263 గ్రామ పంచాయతీలున్నాయి. ఇందులో ఎస్సీలకు 55 స్థానాలు, ఎస్టీలకు 8 స్థానాలు, బీసీలకు 70 స్థానాలు, జనరల్‌కు 130 పంచాయతీలు కేటాయించారు. మండల, జిల్లా పరిషత్‌ల పాలక వర్గాల పదవీ కాలం జూలైలో పూర్తయ్యింది. జిల్లాలో గల 13 మండల పరిషత్‌ల్లో 138 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, ఎస్సీలకు 26 స్థానాలు, ఎస్టీలకు ఒక స్థానం, బీసీలకు 38 స్థానాలు, జనరల్‌కు 73 స్థానాలు కేటాయించారు. ఎంపీపీల్లో ఎస్సీలకు 2, బీసీలకు 5, జనరల్‌కు 6 మండలాలు కేటాయించారు. జడ్పీటీసీల్లో ఎస్సీలకు 3, బీసీలకు 3, జనరల్‌కు 7 మండలాలను కేటాయించారు. ఈ స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 49.5 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నారు. బీసీలకు 27 శాతమే రిజర్వేషన్లు అమలవుతున్నాయి. బీసీ గణనతో బీసీలకు మరిన్ని స్థానాలు పెరగనున్నాయి. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు ఆలస్యమైనా, బీసీ గణన పూర్తయిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీలు, బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బీసీ గణన చేపట్టకుండా ఎన్నికలు నిర్వహిస్తే బీసీల్లో వ్యతిరేకత వస్తుందనే కారణంగా బీసీ గణన చేపట్టిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఫిబ్రవరి 8న ప్రకటించిన అసెంబ్లీ ఓటర్ల జాబితాను అనుసరించి గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఈనెల 6వ తేదీన జాబితాను ప్రకటించనుండగా, 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 19వ తేదీ వరకు వాటిని పరిష్కరించి 21వ తేదీన తుది జాబితాను ప్రకటించనున్నారు. బీసీ గణనతో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెరగనుండడంతో బీసీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భూసేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సింగరేణి కింద చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఆర్జీ 1,2,3 పరిధిలో పెండింగ్ భూసేకరణపై అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ సింగరేణి ఆర్జీ 1, 2, 3 పరిధిలోని పెండింగ్ భూ సేకరణకు సంబంధించి ప్రక్రియ పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రామగిరి, మంథని, రామగుండం మండలాల్లోని భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ఆర్డీవోలు బి గంగయ్య, హనుమా నాయక్, సింగరేణి, రెవెన్యూ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాల పెంపునకు పటిష్ట కార్యాచరణ

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యం పెంపునకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలోని బాలికల ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులకు, మండల విద్యాధికారులకు నిర్వహించిన లర్నింగ్ ఇంప్లిమెంట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీహర్ష మాట్లాడుతూ హైస్కూల్ లెవెల్ ప్రతి విద్యార్థికి తరగతికి సంబంధించిన అభ్యసన సామర్థ్యాలు సాధించే విధంగా ప్రతిఒక్క ఉపాధ్యాయులు కృషి చేయాలని దానికి ప్రధానోపాధ్యాయులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో డి మాధవి, జిల్లా అకడమిక్ అధికారి పీఎం షేక్, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తా..

- ఎంపీ గడ్డం వంశీకృష్ణ



కొలనూర్‌లో ఎంపీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓదెల, సెప్టెంబరు 3 : అన్ని గ్రామాల ప్రజలకు ఉపయోగపడే విధంగా కొలనూర్, ఓదెల, పొత్కపల్లిలో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి తీసుకెళుతానని పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ తెలిపారు. మంగళవారం కాల్వశ్రీరాంపూర్ వైపు వెళుతుండగా మండలంలోని కొలనూర్ రైల్వేగేటు వద్ద కాంగ్రెస్ నాయకులు ఎంపీని కలిశారు. అనంతరం సిర్పూర్ ఎక్స్‌ప్రెస్, తిరుమల తిరుపతి ఎక్స్‌ప్రెస్, అజ్నీ రైళ్ళను కొలనూర్ రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ చేయించాలని, అలాగే కొలనూర్‌తో పాటు పొత్కపల్లి, ఓదెల ఫ్లైఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పార్లమెంటులో ఇవే సమస్యలపై రైల్వే బడ్జెట్‌ను ప్రవేశపెట్టే ముందు సమస్యలను లేవనెత్తడం జరిగిందని, మరోసారి కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండేటి ఐలయ్య యాదవ్, అల్లం సతీష్, సామ రాజేందర్, పల్కలసాగర్, గాజుల శివశంకర్, పెద్ద ఎర్రయ్య, కోమళ్ళసూదన్, రవీందర్, జంగా రాజమల్లు, దొడ్డే స్వామి, బోయిని చేరాలు, రాజు, శ్రీనివాస్, భైరి స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి వరద నీటి సమస్యను పరిష్కరించాలి

ఓదెల, సెప్టెంబరు 3: మండలంలోని ఉప్పరపల్లి రైల్వేగేట్ వద్ద నిర్మించిన అండర్ బ్రిడ్జి కింద నిలిచిన వరద నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఏడీఎన్‌కు రాసిన వినతిపత్రాన్ని మంగళవారం ఏపీడబ్ల్యూఐ నారాయణకు ఉప్పరపల్లి యువకులు అందజేశారు. ఏడీఎన్ ఫోన్ ద్వారా గ్రామస్థులతో మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే వేరే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి పెండింగ్ పనులు ప్రారంభిస్తామని, అలాగే బ్రిడ్జి కింద నీటిని బయటికి పంపించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పల్లె రాకేష్, ఏనుగుల సదయ్య, చేగొండ గట్టయ్య, భైరి రమేష్, భైరి హంస రాజు, పులిపాక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుల నియామకం



పులి శ్రీనివాస్‌రెడ్డి



దొమ్మటి రవి



కల్వల స్వామి

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 3: పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన పులి శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పులి శ్రీనివాస్‌రెడ్డి మండలంలోని మొట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం పెద్దపల్లిలో జరిగిన పీఆర్‌టీయూఎస్ జిల్లా సర్వసభ్య సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్ తెలిపారు. సంఘ అభివృద్ధికి, ఉపాధ్యాయ సమస్యల సాధనకు తన వంతు కృషి చేస్తామని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు కర్రు సురేష్, ప్రధాన కార్యదర్శి గండు కృష్ణమూర్తి, కాల్వశ్రీరాంపూర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముంజాల హరికృష్ణ గౌడ్, కడారి నవీన్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మంథని : పీఆర్‌టీయూ-టీఎస్ జిల్లా ఉపాధ్యక్షులుగా మండలంలోని ఎక్లాస్‌పూర్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న డాక్టర్ దొమ్మటి రవి, మండలంలోని గుంజపడుగు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కల్వల స్వామిలు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

800మెగావాట్లు మంజూరు చేయడం అభినందనీయం

- బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్

గోదావరిఖని, సెప్టెంబరు 3: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ,ఉపాధి కల్పనకు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కృషి చేయాలని, ఏ పార్టీ నేతలు మంచి చేసినా రాజకీయాలకతీతంగా బీజేపీ సమర్థిస్తుందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయకార్యదర్శి ఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులోభాగంగానే రామగుండం బీ థర్మల్‌స్టేషన్ స్థానంలో రాష్ట్ర ప్రభుత్వంతో 800మెగావాట్ల యూనిట్ మంజూరుచేయించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా ప్రధాని నరేంద్రమోదీ నిర్ణయంతో తెలంగాణ ప్రజల కోసం 4000 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలను ఎన్‌టీపీసీలో నెలకొల్పేందుకు మంజూరుచేశారన్నారు. ఇప్పటికే రెండు యూనిట్లు పూర్తయ్యాయని, మరో మూడు యూనిట్లకు బడ్జెట్ మంజూరై కొన్ని సంవత్సరాలు గడుస్తున్నా రాష్ట్రప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోకపోవడం వల్ల ప్లాంట్ల నిర్మాణం జరగడం లేదన్నారు. రామగుండం ఎమ్మెల్యే చొరవ తీసుకుని రాష్ట్ర ప్రభుత్వంతో పీపీఏ చేయించాలని, కొత్తగా నెలకొల్పే విద్యుత్‌ప్లాంట్లలో భూనిర్వాసితులకు, స్థానికులకు ఉద్యోగ, ఉపాధి కల్పించాలన్నారు.

రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరగాలి

- 14లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించాలి
- ఐదు కొత్త గనుల ప్రారంభానికి సన్నాహాలు ముమ్మరం చేయాలి
- వర్షాకాలపు జాగ్రత్తలు పటిష్టంగా చేపట్టాలి
- జీఎంలతో సమీక్ష సమావేశంలో సింగరేణి సీఎండీ బలరాం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

గోదావరిఖని, సెప్టెంబరు 3: ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్య సాధనలో భాగంగా సెప్టెంబర్‌లో రోజుకు కనీసం 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, అదే పరిమాణంలో బొగ్గు రవాణా జరపాలని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్ని ఏరియాల జీఎంలను ఆదేశించారు. బొగ్గు ఉత్పత్తి, రక్షణ, నాణ్యతకు పెద్దపీట వేయాలని ఆయన సూచించారు. మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆయన సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాలో జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నెలవారి ఉత్పత్తి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఏరియా ఉత్పత్తి వివరాలపై గనుల వారీగా సమీక్షించారు. లక్ష్యాలు సాధించకపోవడానికి ఇటీవల కురిసిన వర్షాలు కొంత కారణమని జనరల్ మేనేజర్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న 72మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించుకోవడానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. అలాగే ఈ ఆర్థికసంవత్సరంలో ప్రారంభించాల్సి ఉన్న కొత్తగూడెం వీకే ఓపెన్‌కాస్టు, ఇల్లందు రొంపేడు ఓపెన్‌కాస్టు, బెల్లంపల్లి గోలేటి ఓపెన్‌కాస్టు, రామగుండం కోల్‌మైన్‌కు సంబంధించిన అన్ని పెండింగ్ పనులు వేగంగా పూర్తిచేయాలని కోరారు. కొత్త అనుమతుల సాధనకు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఆదేశించారు. ఒడిశా రాష్ట్రంలో సింగరేణి సంస్థ ప్రారంభించాల్సిన నైనీ బొగ్గు బ్లాక్‌పై కూడా ఆయన సమీక్షించారు. నైనీ బ్లాకున్న ప్రదేశంలోని చెట్ల గణన, తొలగింపు జరిగితే ఉత్పత్తి ప్రారంభించుకోవచ్చునని, దీనికోసం అక్కడి అటవీశాఖను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ పనులు వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డీ సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, జీ వెంకటేశ్వర్‌రెడ్డి, జనరల్‌మేనేజర్(కోఆర్డినేషన్) ఎస్‌డీఎం సుభాని, జనరల్ మేనేజర్(సీపీపీ) జక్కం రమేష్, జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) రవి ప్రసాద్, కొత్తగూడెం కార్పొరేట్ నుండి వివిధ విభాగాల జీఎంలు, జీఎంలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

రామగుండంలో షీ టీమ్‌లకు స్పందన

- ఆగస్టులో 9 ఫిర్యాదులు - షీటీమ్‌లపై అవగాహన కార్యక్రమాలు - కమిషనర్ శ్రీనివాస్

కోల్‌సిటీ, సెప్టెంబరు 3: రామగుండం కమిషనరేట్‌లో షీ టీమ్‌లకు మంచి స్పందన లభిస్తుందని, బాధిత మహిళలు, విద్యార్థినులు ఫోన్ల ద్వారా నేరుగా షీటీములను సంప్రదిస్తున్నారని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మహిళలు, బాలికలు, విద్యార్థినుల భద్రతే లక్ష్యంగా షీ టీములు పని చేస్తున్నాయన్నారు. కమిషనరేట్‌లో రెండు షీటీమ్ బృందాలు ఉన్నాయని, స్కూల్స్ కాలేజీల వద్ద ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్ బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్, వరకట్న చట్టాలు, మహిళా చట్టాల గురించి అవగాహన కల్పిస్తున్నాయన్నారు. మహిళలు, బాలికలపై ఆన్‌లైన్‌లో అసభ్యకర పోస్టులు పెట్టే సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ షీటీములు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయన్నారు. రోడ్లపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా, ఉద్దేశ పూర్వకంగా వెంబడించినా కమిషనరేట్ షీటీమ్ నంబర్ 6303923700కు కాల్ చేయాలని లేదా వాట్సాప్ ద్వారా సందేశం పంపాలన్నారు. డయల్ 100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. ఆగస్టు నెలలో కమిషనరేట్ షీ టీమ్‌కు మొత్తం 9 ఫిర్యాదులు వచ్చాయని, అందులో ఏడు ఫిర్యాదులు పెద్దపల్లి, మంచిర్యాల షీటీమ్ కార్యాలయానికి నేరుగా వచ్చి ఫిర్యాదు చేశారన్నారు. రెండు ఫిర్యాదులు మాత్రమే వాట్సాప్‌లో వచ్చాయన్నారు. బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఒక ఫిర్యాదుపై కేసు కూడా నమోదు చేశామని, మిగతా 8 ఫిర్యాదులపై కౌన్సెలింగ్ నిర్వహించామని కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

కమిషరేట్ పరిధిలో షీ టీమ్ ఆధ్వర్యంలో మొత్తం 57 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, 204 హాట్ స్పాట్లను విజిట్ చేశామన్నారు.

సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి కృషి

- జనరేటర్, స్కానింగ్, ఈసీజీ సౌకర్యాల కల్పన - డాక్టర్లు, నర్సుల భర్తీకి చర్యలు - ఎమ్మెల్యే విజయరమణారావు



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, సెప్టెంబరు 3: సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక పరికరాల ఏర్పాటు, అవసరమైన డాక్టర్ల, నర్సులు, సిబ్బంది భర్తీ కోసం తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఎమ్మెల్యే మంగళవారం ఉదయం ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చిన వారితో ఆయన మాట్లాడి, అందుతున్న సేవల గురించి, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి ద్వారా మరిన్ని వివరాలు అడిగి అస్పత్రిలో ఉన్న సమస్యల గురించి రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. డాక్టర్ల సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను అయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ నాలుగైదు మండలాలకు పెద్ద దిక్కుగా ఉన్న సుల్తానాబాద్ ఆసుపత్రిలో ఆధునిక పరికరాల ఏర్పాటు ఆవశ్యకతను తెలుసుకున్నామని, ఈ మేరకు ఆసుపత్రిలో జనరేటర్ ఏర్పాటు అత్యంతఅవసరమని గుర్తించామన్నారు. దాంతో పాటు స్కానింగ్ మిషన్, ఈసీజీ తదితర పరీక్షలకు సంబంధించిన పరికరాలను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానన్నారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పలువురు డెంగ్యూ, చికెన్‌గున్యా తదితర విషజ్వరాలతో బాధపడుతున్నారని అయితే ఈ ఆస్పత్రిలో సాధ్యమైనంత వరకు మెరుగైన చికిత్స అందిస్తున్నారని అన్నారు. రోగులకు అందుతున్న సేవల పట్ల ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మినుపాల ప్రకాశ్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, వేగోళం అబ్బయ్య గౌడ్, ముస్త్యాల రవీందర్, రాజలింగం, పన్నాల రాములు, కుమార్ కిశోర్, మండల రమేష్, పులి వెంకటేశం, కల్లేపల్లి జానీ, మోబిన్, దూడం అంజనేయులు, రాజయ్య, రాజు, రఫీ, రవి, మేడీ శ్రీను పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● 17 నుంచి ప్రజా పాలన..

ఈనెల 17నుంచి రాష్ట్రంలో ప్రజా పాలన కార్యక్రమాన్ని అమలు చేయనున్నామని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 49 మంది లబ్ధిదారులకు రూ 50 లక్షలకు పైగా విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 17 నుంచి గ్రామగ్రామాన రెండవ విడత ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఇందులో అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డులను అందజేయడం కోసం దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. గతపదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ హయాంతో ఏ ఒక్క పేద వ్యక్తికి ఇల్లు ఇవ్వలేదని, కేవలం మాటలతో గారడీ చేశారని విమర్శించారు. సుల్తానాబాద్ పట్టణంలో అసంపూర్తిగా ఉండిపోయిన డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణాలను సీఎం సహకారంతో పూర్తి చేసి అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమతకృష్ణ, కేడీసీసీబీ డైరక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, పలువురు కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

వచ్చేనెల 18 వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

- మంథని ఆర్డీవో హనుమానాయక్

మంథని, సెప్టెంబరు 3: మంథని నియోజకవర్గంలో అక్టోబరు 18వ తేదీ వరకు ప్రత్యేక ఓటరు జాబిత సవరణ కార్యక్రమం కొనసాగుతుందని ఆర్డీవో హనుమా నాయక్ మంగళవారం తెలిపారు. తన చాంబర్‌లో జరిగిన అన్ని రాజకీయ పార్టీలు, తహసీల్దార్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 290 పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఇంటింటా ఓటర్ల సర్వే కొనసాగుతుందన్నారు. బీఎల్‌వోలు ఇంటింటిని సందర్శించి ఓటర్ వారిగా సర్వే చేస్తారన్నారు. చనిపోయిన, శాశ్వతంగా వెళ్లిపోయిన, రెండు, లేదా మూడుసార్లు నమోదైన ఓటర్ల వివరాలను గుర్తించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారిని నూతన ఓటర్లు గుర్తించి వారి జాబితా తయారు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో అన్ని రాజకీయ పార్టీల ఏజెంట్లు బీఎల్‌వోలకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నేతలు, 10 మండలాల తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోషణ మాసం కార్యక్రమాలను విజయవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ

పెద్దపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పోషణ్ మహ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో 7వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమాలను ప్రారంభిస్తూ, ప్రత్యేకంగా రూపొందించిన కార్యక్రమాల పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పోషణ మాసం అనేది దేశవ్యాప్తంగా పోషకాహారంపై అవగాహన కల్పించడం, పిల్లలు, గర్భిణులు, బాలింతలు, యువతుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి చేపడుతున్న ఒక గొప్ప కార్యక్రమమని అన్నారు. పోషణ మాసం కార్యక్రమాలు సెప్టెంబరు 1 నుంచి 30 వరకు జరగనున్నాయని తెలిపారు. ఈ ఏడాది పోషణ మాసం ప్రత్యేకంగా గ్రోత్ వృద్ధి మానిటరింగ్, రక్తహీనత నివారణ, అనుబంధ ఆహారం, సాంకేతికత ఉపయోగంవంటి అంశాలపై దృష్టిసారించనుంది. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్, పెద్దపల్లి, రామగుండం, మంథని సీడీపీలు కవిత, అలేఖ్య, పుష్పలత, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 3: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని ప్రజలు వ్యక్తిగత ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి, డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలతో తాగునీరు కలుషితం అవుతుందని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారపదార్థాలను తీసుకోవాలని, నిల్వ ఉంచిన ఆహారాలను తీసుకోవద్దని, బయటి తినుబండారాలను తినవద్దన్నారు. కలుషిత నీరు, ఆహారం తీసుకుంటే నీళ్ల విరోచనాలు, టైఫాయిడ్‌లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు సమీప ఆరోగ్యకేంద్రం లేదా ప్రభుత్వ ఆసుపత్రులలో సంప్రదించాలని కోరారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కథలాపూర్, సెప్టెంబరు 3: మండలంలోని సిరికొండ శివారులో మంగళవారం సాయంత్రం పోలీసులు పేకాట శిబిరంపై దాడులు చేసి 11 మంది పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. గ్రామ శివారులో పేకాడుతున్నట్టు స మాచారం రావడంతో దాడులు నిర్వహించి వారి నుంచి రూ.74,220లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నవీన్ తెలిపారు.

బావిలో పడిన ఎలుగుబంటి

● నిచ్చెన ఏర్పాటు చేయడంతో

బయటికి వచ్చినట్లు గుర్తించిన అధికారులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3: ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి శివారులోని పాడుబడిన వ్యవసాయ బావిలో ఎలుగుబంటి పడిందనే సమాచారంతో వెంకటాపూర్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మోహన్‌లాల్ ఆధ్వర్యంలో అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. గ్రామ శివారులోని బావిలో నుంచి ఎలుగుబంటి అరుపులు రావడంతో గమనించిన చుట్టు పక్కల రైతులు సోమవారం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న డీఆర్వో మోహన్‌లాల్, ఎఫ్‌బీవో అనూష పరిశీలించారు. ఎలుగుబంటిని కాపాడేందుకు స్థానికుల సహాయంతో చర్యలు చేపట్టారు. సుమారు 15 మీటర్ల లోతు ఉన్న పాడు బడిన వ్యవసాయ బావిలో నిచ్చెనలను ఏర్పాటు చేశారు. చీకటి పడడంతో వెనుదిరిగారు.


అటవీశాఖ అధికారులు బావిలో ఏర్పాటు చేసిన నిచ్చెన

మంగళవారం చేరుకొని పరిశీలించారు. బావిలో నుంచి శబ్దం వినిపించలేదని, నిచ్చెనకు ఎలుగుబంటి వెంట్రుకలు కనిపించాయని, బావిలోంచి ఎలుగుబంటి నిచ్చెన ద్వారా బయటకు వెళ్లిన ఆనవాళ్లను గుర్తించామని డీఆర్వో మోహన్‌లాల్ పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 3 : జగిత్యాల మండలం పెర్కపల్లి లోలెవల్ వంతెన వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సారంగాపూర్ మండలం రేచపల్లికి చెందిన తునికి జగన్(46) అనే వ్యక్తి మృతి చెందాడు. రేచపల్లి గ్రామానికి చెందిన జగన్ రాత్రి తన పని నిమిత్తం హన్మాజీపేట వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి జగిత్యాలకు వస్తున్న క్రమంలో హన్మాజీపేట లోలెవల్ వంతెన వద్ద బైక్ అదుపుతప్పి కింద పడడంతో మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు.

దంపతులకు గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామ శివారులో మంగళవారం కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపు తప్పి భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామానికి చెందిన తిరుపతి తన భార్యతో కలిసి బైక్‌పై ఎల్లారెడ్డిపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఒక్కసారిగా కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. =కాంగ్రెస్ నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, రాంరెడ్డి గమనించి మండల కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీకొని ట్రాలీ ఆటో బోల్తా

● ఒకరికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 3: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని ట్రాలీ ఆటో మంగళవారం బోల్తా పడింది. ఈ సంఘటనలో సిరిసిల్ల పట్టణానికి చెందిన మధుకు తీవ్ర గాయాలయ్యాయి. డ్రైవర్ స్వల్పగాయాలతో బయట పడ్డాడు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కామారెడ్డి నుంచి సిరిసిల్ల వైపునకు వెళుతున్న ట్రాలీ ఆటో మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో డివైడర్‌ను అతి వేగంగా ఢీకొట్టి ప్రధాన రహదారిపై తలకిందులైంది. ఆ సమయంలో రోడ్డు వాహనాలు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. కాగా ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	2,20,473	1,95,853	80.5	70.425
ఎల్లంపల్లి	4,72,354	4,72,064	20.175	14.248
మిడ్ మానేరు	17,680	6,400	27.54	21.52
ఎల్ఎండీ	2,708	277	24.034	16.26
ఎగువమానేరు	27,500	-------	2.00	2.00

ఇద్దరు బ్యాటరీల దొంగల అరెస్టు

పెగడపల్లి, సెప్టెంబరు 3: పెగడపల్లి మండలంలో ఇద్దరు బ్యాటరీల దొంగలను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. నెల రోజులుగా మండలంలోని నందగిరి, అయిత్‌పల్లి గ్రామాలలో బయట నిలిపిన డీసీఎం వ్యానుల నుంచి బ్యాటరీలు దొంగిలిస్తున్నారనే పిర్యాదులు న్నాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపి బ్యాటరీలు దొంగిలించిన మాదవేని ప్రశాంత్, ఉబిది అంజయ్య లంబాడిపల్లిలను అరెస్టు చేసి, అయిత్‌పల్లి శివారులో దాచి ఉంచిన బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

రెండు షాపుల్లో దొంగతనం

రామడుగు, సెప్టెంబర్ 3: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో పక్కపక్కనే ఉన్న రెండు దుకాణాల్లో మంగళవారం చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేశ్వర మెకానిక్ సెంటర్, వెంకటేశ్వర ఇంజనీరింగ్ వర్క్ షాప్ యాజమానులు రోజులాగే సోమవారం రాత్రి షాపు తాళం వేసి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి అశోక్ అనే వ్యక్తి షాపు కౌంటర్‌లో నుంచి రూ.15 వేల నగదు, శంకరయ్య అనే వ్యక్తి షాపులో నుంచి రూ.2 వేల నగదు చోరీ అయింది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

విద్యార్థులూ పాఠశాలకు రండి

పెద్దాపూర్ గురుకులం... నెల రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారి తీసిన పాఠశాల. విద్యార్థుల వరుస మరణాలు, కొందరు విద్యార్థుల అస్వస్థత అటు విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠశాల యాజమాన్యాన్ని, అధికారులను ఆందోళనకు గురిచేసింది.పాఠశాల చుట్టూ అపరిశుభ్రత, విద్యార్థులకు కనీస వసతుల లేమి, పాత భవనాల్లోనే పాఠాల కొనసాగింపు ఇలా రకరకాల సమస్యలు ఒక్కసారిగా తెరపైకి వచ్చాయి. 15 రోజుల్లో ఇద్దరు విద్యార్థుల మృతి, మరో నలుగురు విద్యార్థులు అస్వస్థతతో ఆస్పత్రిలో చేరడంతో తల్లిదండ్రులు భయాందోళనలకు గురయ్యారు.
తమ పిల్లలకు ఏం జరుగుతుందో అని ఒక్కొక్కరుగా వారి వారి పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. పాఠశాలలో వరుస మరణాలతో ప్రభుత్వం తక్షణ చర్యలకు పూనుకుంది.
డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పాఠశాలను తనిఖీ చేసి అధికారులకు మౌలిక వసతుల కల్పనకు ఆదేశాలు జారీ చేశారు. ఆ సంఘటన తరువాత నెల రోజుల పాటు మూతపడ్డ పాఠశాల అన్ని రకాల వసతులు కల్పించి మళ్లీ పునఃప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి ఒక్కొక్కరినీ పిలుస్తున్నారు.

● నేటి నుంచి పెద్దాపూర్ గురుకులం పునః ప్రారంభం ● వసతులు కల్పించిన అధికారులు ● ఫోన్లు చేసి పిలుస్తున్న ఉపాధ్యాయులు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 3: ఇన్ని రోజులూ సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడిన మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో సౌకర్యాలు కల్పించడంతో బుధవారం నుంచి పునఃప్రారంభం కానుంది. ఇటీవల పాఠశాలలో పలు ఘటనలు జరగడంతో అధికారులు విద్యార్థులకు సెలవులు ప్రకటించారు. గురుకులం పాఠశాల, కళాశాలలో మొత్తం 540 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలోని విద్యార్థుల మరణాలు, అస్వస్థతకు గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. గురుకుల పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. పాఠశాలకు రావడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల పాఠశాలలో వరుస విద్యార్థుల మరణాలతో బెంబేలెత్తిన అధికారులు పాఠశాలలో వసతులు కల్పించారు. వరుస ఘటనలతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాఠశాలను సందర్శించారు. గురుకులంలోని గదులు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించాలని నిధులు మంజూరు చేశారు. దీంతో పాఠశాలకు సుమారు ఇరవై రోజుల పాటు సెలవులు ప్రకటించారు.

ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు

గురుకుల పాఠశాలలో వరుసగా జరిగిన సంఘటనలతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి, పనులు చేపట్టాలని ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు వసతులు కల్పించారు. గతంలో పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న రేకుల షెడ్లు, చిన్నపాటి బావులు, పిచ్చి మొక్కలు తొలగించారు. పారిశుధ్య పనులు చేపట్టారు. చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడంతో పాటు శానిటేషన్ చేశారు. నూతన భవనంలో కరెంట్, ప్లంబింగ్, కిటికీలు, కావాల్సిన మరమ్మతులను చేయించారు. విద్యార్థులు పడుకోవడానికి బెడ్‌లు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసుతులు కల్పించారు.

పాఠశాలకు రావాలని ఉపాధ్యాయుల ఫోన్లు

గురుకులంలో చదువుకునే విద్యార్థులు తిరిగి పాఠశాలకు రావాలని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు రెండు రోజుల నుంచి ఫోన్లు చేస్తున్నారు. గురుకులంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశామని, విద్యార్థుల భవిష్యత్ కోసం తమ పిల్లలను గురుకులం తిరిగి పంపించాలని తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఫోన్ల ద్వారా సమాచారం అందిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులు నష్టపోతున్నారని, వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు పంపించాలని కోరుతున్నారు.


పెద్దాపూర్ గురుకుల పాఠశాల

అధికారుల సూచనల మేరకు ప్రారంభం
- మాధవీలత, ప్రిన్సిపాల్

చదువులో విద్యార్థులు నష్టపోకుండా ఉన్నత అధికారుల సూచనల మేరకు పదవ తరగతి, ఇంటర్ మీడియట్ కళాశాల విద్యార్థులకు కోసం తరగతులు ప్రారంభిస్తున్నాం. మరో వారంలోగా పూర్తి స్థాయిలో అన్ని తరగుతులు ప్రారంభిస్తాం. పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన వసతులను ఏర్పాటు చేశాం. విద్యార్థులను పాఠశాలకు పంపించాలని తల్లిదండ్రులను కోరుతున్నాం.

ఘనంగా వ్యవసాయ యూనివర్సిటీ ఫౌండేషన్‌డే

జగిత్యాల అర్బన్, సెప్టెంబర్ 3: ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆవిర్భావం జరిగి పదేళ్ల గడుస్తున్న సందర్భంగా జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానం పొలాసలో యూనివర్సిటీ ఫౌండేషన్‌డే దశాబ్ది సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి ఏడీఆర్ డాక్టర్ శ్రీలత హాజరై జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొలాస పరిశోధన స్థానం నుంచి విడుదల అయిన వరి, నువ్వుల వంగడాలు, సాంకేతిక పరిజ్ఞానం అత్యంత ప్రాచుర్యం పొందాయన్నారు. అదే విధంగా విద్యార్థులు బాగా చదివి మంచి ర్యాంకులు సాధించాలన్నారు. ఈ యేడాది అగ్రికల్చర్ పాలిటెక్నిక్ జగిత్యాలకు ఉత్తమ అవార్డు రావడం సంతోషకరం అన్నారు. అలాగే పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డా.బలరాం నాయక్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బెస్ట్ టీచర్, సైంటిస్టు అవార్డు, నాన్‌టీచింగ్ స్టాఫ్‌లో పోసవ్వకు ఉత్తమ ఆఫీస్ సబార్డినేట్‌గా అవార్డులు రావడం అభినందనీయం అన్నారు. అన్ని రకాల అధికారులు, సిబ్బంది, కార్మికులు సమన్వయంతో పనిచేసి యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో దేవయ్య, అసిస్టెంట్ కంప్ట్రోలర్ పురుషోత్తం, వివిధ హోదాల అధికారులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది, కార్మికులతో పాటు కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం 10వ వార్షికోత్సవాన్ని రాజేంద్రనగర్ యూనివర్సిటీ నుంచి యూట్యూబ్ ద్వారా లైవ్‌లో వీక్షించారు.


సంబరాల్లో పాల్గొన్న పొలాస పరిశోధన స్థానం అధికారులు, శాస్త్రవేత్తలు

గల్లంతైన మత్స్యకార్మికుడు మృతి

- వాగు సమీపంలో మృతదేహం లభ్యం

గంభీరావుపేట, సెప్టెంబరు 3: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం మానేరు సమీపాన లచ్చపేట వాగువద్ద గల్లంతైన మత్స్యకార్మికుడు మృతి చెందాడు. వాగు ప్రవాహం తగ్గడంతో మంగళవారం అతడి మృతదేహం లభ్యమైంది. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం లచ్చపేటకు చెందిన శివరాములు అనే మత్స్య కార్మికుడు ఆదివారం ఉదయం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేట మండలం మానేరు సమీపాన లచ్చపేట వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుక్కుంటూ వెళ్లారు. వాగు ఒడ్డున శివరాములు దుస్తులు, చెప్పులు కనిపించడంతో గల్లంతయినట్టు భావించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజులుగా వాగు పరివాహక ప్రాంతాల్లో గాలించినా శివరాములు ఆచూకీ లభించలేదు. మంగళవారం వరద ప్రవాహం తగ్గడంతో లచ్చపేట శివారులో వాగు ప్రాంతంలో శివరాములు మృతదేహం లభించింది.

దుబాయ్‌లో క్షమాభిక్ష ప్రక్రియ షురూ

- అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు ఊరట

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 3: దుబాయ్‌లో మళ్లీ క్షమాభిక్ష ప్రక్రియ మొదలైంది. దుబాయ్ ప్రభుత్వం ఐదేళ్ల తరువాత అమ్నెస్టీ ప్రకటించడంతో అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు ఊరట లభించింది. దీంతో ఐదేళ్లుగా దుబాయ్‌లో వీసా గడువు ముగిసి అక్కడే ఉంటున్న కార్మికులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ క్షమాభిక్ష సెప్టెంబరు 1న ప్రారంభమైనా అక్టోబరు 31తో ముగియనుంది. దుబాయ్‌లో చట్ట విరుద్ధంగా తెలంగాణప్రాంతానికి చెందిన దాదాపు 40 వేల మంది వలస కార్మికులు ఉంటారని అంచనా. దుబాయ్ ప్రభుత్వం అమ్నెస్టీ ప్రకటించడంతో వలస కార్మికులు తిరిగి స్వగ్రామాలకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వేలాది మంది విజిట్ వీసాపై వెళ్లి అక్కడే ఉంటూ వివిధ ఉపాధి పనులు చేసుకుంటున్నా వలస కార్మికులు తిరిగి వచ్చేందుకు ఇండియన్ ఎంబసీ వద్ద క్యూ కడుతున్నట్లు తెలిసింది. దుబాయ్‌లో వీసా గడువు ముగిసి అక్రమంగా ఉంటున్న వలస కార్మికులు టికెట్, అవుట్ పాస్‌పోర్టు కోసం సొంతంగా ఖర్చులు భరించాల్సి ఉంటుంది. ఈ ఖర్చులతో కలిపి దరఖాస్తు చేసుకుంటే దుబాయ్ నుంచి తిరిగి వచ్చేందుకు అవుట్ పాస్ అనుమతి లభిస్తుంది. దుబాయ్‌లోని వివిధ క్యాంపులలో అక్రమంగా ఉంటున్న వలస కార్మికులకు క్షమాభిక్ష ద్వారా తిరిగి వచ్చేందుకు సదవకాశం లభించింది.

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 3: కరీంనగర్‌లోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన మసీదు మహేష్(40) సోమవారం అర్ధరాత్రి ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఒకటో టౌన్ పోలీసులు తెలిపారు. అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మహేష్ 15 రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఏ పనిచేయలేక పోతున్నాడని, మనస్థాపంతోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుడి సోదరుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

12లోగా ఎంఫార్మసీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 3: ఎస్‌యూ పరిధిలోని ఎం.ఫార్మసీ రెండో, నాలుగో సెమిస్టర్ విద్యార్థులు, బి.ఫార్మసీ 2, 4, 6వ సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ) విద్యార్థులు ఈనెల 12లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో 18వ తేదీ వరకు చెల్లించడానికి గడువు ఉందని తెలిపారు. పరీక్షలను సెప్టెంబరు లేదా అక్టోబరు నెలలో నిర్వహించనున్నారు.

జ్వరంతో యువకుడి మృతి


రాజ్ కుమార్(ఫైల్)

సారంగాపూర్, సెప్టెంబరు3: మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన చెంది రాజ్ కుమార్(30) అనే యువకుడు జ్వరంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పెంబట్ల గ్రామానికి చెందిన రాజ్ కుమార్ పెంబట్ల, కోనాపూర్ సహకార సంఘం కార్యాలయంలో సీఈవోగా విధులు నిర్వహిస్తున్నాడు. 15 రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స తీసుకున్నా తగ్గక పోవడంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ రాజ్‌కుమార్ మృతి చెందాడు. మృతుడికి కుమారుడు, భార్య ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శించారు.

వరద నీటిపై ప్రజలను అప్రమత్తం చేయాలి

● శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వస్తున్న వరద నీటిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మంత్రి రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్‌తో కలిసి సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీటిని, గోదావరిలోకి వదిలిపెడుతున్న నీటిని ఆయన పరిశీలించారు. వరద పరిస్థితిని ఆయన నీటి పారుదల శాఖాధికారులతో తెలుసుకున్నారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా కలెక్టర్లు కోయ శ్రీహర్ష, కుమార్ దీపక్‌కు పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితులను అంచనా వేస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. గత ఏడాది ఒకేసారి 8 లక్షల క్యూసెక్కుల వరద నీరు రావడంతో జిల్లాలోని గోదావరిఖని, మంథని పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయని, అలాంటి పరిస్థితులు పునరావృతంగా కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంచిర్యాల, చెన్నూర్ ప్రాంతంలోని గోదావరి తీర ప్రాంత ప్రజలను కూడా అప్రమత్తం చేయాలన్నారు. విపత్తులు సంభవిస్తే సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని రామగుండం సీపీ శ్రీనివాస్‌కు సూచించారు.


వరద పరిస్థితిపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ప్రాజెక్టులకు కొనసాగుతున్న ప్రవాహం

జగిత్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద పోటెత్తుతోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 2,20,473 క్యూసెక్కుల నీరు వస్తుంటే..41 గేట్లు పైకి ఎత్తి దిగువకు 2,20,473 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మరో 17 వేల క్యూసెక్కులు వరద కాలువకు, 4 వేల క్యూసెక్కులు కాక తీయ కాలువకు, 4 వేల క్యూసెక్కులు ఎస్కేప్ గేట్ల ద్వారా విద్యుత్తు తయారీకి విడు దల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 70.140 టీఎంసీల నీరు ఉంది.

ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద..

పెద్దపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి పెద్దఎత్తున వరద నీరు వస్తున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీటితో పాటు క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన వరద నీరంతా ప్రాజెక్టులోకి వస్తున్నది. మంగళవారం సాయంత్రం వరకు 4,72,354 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో ఎస్సారెస్పీ నుంచి 2,59,928 క్యూసెక్కులు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 2,12,426 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. దిగువకు 4,72,064 క్యూసెక్కుల నీటిని 32 గేట్ల ద్వారా గోదావరిలోకి వదిలిపెడుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.248 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. మిడ్ మానేరుకు ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో ఇక్కడి నుంచి ఎత్తిపోతలను సోమవారం ఉదయం నుంచే నిలిపి వేశారు.

మిడ్ మానేరుకు వరద

బోయినపల్లి : శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూల వాగు ఎస్సారెస్పీ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 17,680 క్యూసెక్కుల నీరు వస్తుండగా, ఇందులో మానేరు, మూలవాగు ద్వారా 4080, ఎస్సారెస్పీ నుంచి 13,100 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరు తోంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400 క్యూసెక్కుల నీటి ని తరలి స్తున్నారు. ప్రాజెక్టు పూర్థి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 315.27 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27. 54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 21.52. టీఎంసీల మేరకు ఉంది. నేటి నుండి ఉదయం నుండి ఎల్ఎండి ప్రాజెక్టుకు 10 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేయనున్నట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.


కోటిలింగాల వద్ద గోదావరిని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

ఎల్ఎండీలోకి తగ్గుతున్న వరద

తిమ్మాపూర్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోనికి మోయతుమ్మెద వాగు నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరింది. అయితే మంగళవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో ఎగువ నుంచి మోయతుమ్మెద వాగు నుంచి వస్తున్న వరద తగ్గింది. జలాశయంలోనికి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గింది. ఎల్ ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టిఎంసిలు కాగా ప్రస్తుతం 16.263 టిఎంసిలకు చేరుకుంది. మోయతుమ్మెద వాగు నుంచి 5,805 క్యూసెక్కులు, ఎగువ ఎల్ఎండి నుంచి 769క్యూసెక్కులు మొత్తం 6,574 క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి రాగా రాత్రి వరకు 2,708కి పడిపోయింది. అవుట్ ఫ్లో 277 క్యూసెక్కులు ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ధర్మపురి వద్ద ఉధృతంగా గోదావరి

ధర్మపురి : ధర్మపురి వద్ద గోదావరి వరద మంగళవారం సాయంత్రం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ధర్మపురి చుట్టు పక్కల గ్రామాలకు చెందిన నదీ తీరాన గల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. గోదావరి నీటి మట్టం క్షణక్షణం పెరిగి వేగంగా ప్రవాహం కొనసాగింది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ సిబ్బంది అప్రమత్తం చేశారు. అలాగే నదీ తీరాన గల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు తహసీల్దార్ కృష్ణ చైతన్య, సీఐ రాంనర్సింహారెడ్డి పరిశీలిస్తున్నారు.


ఎల్ఎండీ జలాశయం

కోటిలింగాల వద్ద కొనసాగుతున్న వరద

వెల్గటూర్: ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కోటిలింగాల వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎస్పీ అశోక్ కుమార్ కోటిలింగాల వద్ద గోదావరి వరద తీవ్రతను పరిశీలించారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయా లని అధికారులను ఆదేశించారు. కోటిలింగాల, చెగ్యాం వద్ద గోదావరి పరి వాహక ప్రాంతాలలో పర్యటించి, ప్రజలు, మత్స్యకారులు పశువుల కాపర్లు గోదావరిలోకి వెళ్లవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రఘు చందర్, సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్సై ఉమా సాగర్ పాల్గొన్నారు.

13న కొండగట్టు తలనీలాల టెండర్లు

● మూడవ సారి నిర్వహణకు ఏర్పాట్లు
● హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో టెండర్లు


కొండగట్టు అంజన్న ఆలయం

మల్యాల, సెప్టెంబరు 3: కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో భక్తులు సమర్పించే తలనీలాల పోగు చేసుకునేందుకు గాను దేవస్థానం అధికారులు మరో సారి టెండర్లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే రెండు సార్లు టెండర్లు నిర్వహించగా తగిన వేలం రాకపోవడంతో వాయిదా వేసిన అధికారులు మూడవ సారి ఈ నెల 13న నిర్వహించనున్నారు. ఈ ఆగస్టు నుంచి వచ్చే ఏడాది జూలై నెలాఖరు కాలపరిమితికి గాను హైదరాబాద్‌లోని దేవాదాయ కమిషనర్ కార్యాలయంలో ఈ-టెండర్, సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం జరుగనుంది. మొదటి సారి టెండర్ ఫిబ్రవరి 7న నిర్వహించిన వేలంలో రూ.కోటి 62లక్షల 1116 హెచ్చు పాట రాగా ఈ సారి అక్కడి నుంచే వేలం ప్రారంభించనున్నట్లు ఈవో రామకృష్ణరావు తెలిపారు. మరిన్ని వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సంప్రదించవచ్చునని అన్నారు.

ఘనంగా గోపాల కాల్వలు

ధర్మపురి, సెప్టెంబరు 3: శ్రావణ మాసం ముగింపు సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో గోపాల కాల్వలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే విధంగా ఉదయం స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి, రామ లింగేశ్వర స్వామి వారలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఉగ్ర నారసింహుని ఆలయంలో రాజ రాజేశ్వరి భజనా మండలి సభ్యులు, ఆర్యవైశ్యులు, భక్తులు భజనా కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, వేద మంత్రాల మధ్య అందంగా పూలతో అలంకరణ చేసిన స్వామి వారలకు అభిషేకం, విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆర్యవైశ్యులు, భక్తులు గోదావరి నది వరకు ఊరేగింపు జరిపారు.

జమ్మికుంటలో గంజాయి పట్టివేత


● ఐదుగురు యువకులపై కేసు

జమ్మికుంట రూరల్ ,సెప్టంబర్ 3: పట్టణంలోని గణేష్‌నగర్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న యువకుల వద్ద నుంచి 700 గ్రాముల గంజాయిని మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గణేష్‌నగర్‌లో నలుగురు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా యువకులను గమనించారు. అనుమానాస్పదంగా ఉండటంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బావండ్ల పల్లి అఖీల్,వస్తం కూమార్, చాందల్య కిషోర్, వి విష్ణువర్థన్‌తో పాటు గంజాయి విక్రయించిన బిజిగిరి షరీఫ్‌కు చెందిన ఎండి అక్రమ్‌పై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ వరగంటి రవి తెలిపారు. గంజాయి విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

● పెళ్లైన 15 రోజులకే మృత్యు ఒడికి
● విషాదంలో కుటుంబం

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 3: పెళ్లైన 15 రోజులకే ఓ యువకుడు మృతిచెందడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. భర్తతో కలిసి నూరేళ్ల జీవితాన్ని ఎంతో సంతోషంగా గడపాలనుకున్న ఆ ఇల్లాలి కలలు కల్లలయ్యాయి. మండలంలోని గుమ్లాపూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మేడిపల్లి మండలం వల్లంపల్లి గ్రామానికి చెందిన నవీన్ (26) మృత్యువాత పడ్డాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నవీన్ ఉపాధి నిమిత్తం సింగపూర్ వెళ్లి గత నెలలో తిరిగి వచ్చాడు. నవీన్‌కు గత నెల 18 చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. కటకం నవీన్, ఎలిశెట్టి భూమేశ్వర్, పార్థసారధి ముగ్గురు స్నేహితులు ద్విచక్ర వాహనంపై మాచాపూర్ మీదిగా కోరుట్ల పట్టణానికి వస్తున్నారు. గుమ్లాపూర్ గ్రామ శివారులో వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని గుమ్లాపూర్ గ్రామం వైపు వెలుతున్న ఆటో ఢీకొట్టింది. ఈ సంఘటనలో నవీన్ భూమేశ్వర్ తీవ్ర గాయాల పాలయ్యారు. పార్థసారధికి స్వల్పగాయాలయ్యాయి. స్థానికు లు వెంటనే 108 ద్వారా క్షతగాత్రులను కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే నవీన్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భూమేశ్వర్‌కు ప్రథమ చికిత్సను అందించి మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. సంఘటన జరిగిన ప్రాంతాన్ని రాత్రి 8 గంటల వరకు కూడా పోలీసులు పరిశీలించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.


నవీన్ (ఫైల్)

జమ్మికుంటలో దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ నిలపాలి

- రైల్వే మంత్రికి బండి సంజయ్ లేఖ
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

జమ్మికుంట, సెప్టెంబర్ 3: జమ్మికుంట రైల్వేస్టేషన్లో గత 30సంవత్సరాలుగా ఆగుతున్న దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ ఎత్తి వేసిన విషయంపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కేంద్ర రైల్వే శాఖ మంత్రికి లేఖ రాశారు. గత నెల 6వ తేదీన 'ఆంధ్రజ్యోతి' జిల్లా అనుబంధంలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కేంద్ర హోం సహాయక మంత్రి బండి సంజయ్‌కుమార్ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని ప్రస్తావించారు. జమ్మికుంట వ్యాపార కేంద్రమని, ఎంతో మంది వ్యాపారులు, ఉద్యోగులు, ప్రజలు దక్షిణ్‌లో రాకపోకలు సాగిస్తారన్నారు.

విలీన వార్డుల్లో సమస్యల తిష్ఠ

- పెద్దబొంకూర్‌లోని రెండు వార్డులు మున్సిపల్‌లో విలీనం - పారిశుధ్యం, అభివృద్ధిని పట్టించుకోని అధికారులు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 3 : పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రెండు వార్డులను ప్రభుత్వం మున్సిపల్‌లో విలీనం చేసింది. అయితే ప్రభుత్వ చర్యతో తాము ఇబ్బందులు పడుతున్నామని వార్డు ప్రజలు వాపోతున్నారు. తమను మళ్లీ గ్రామపంచాయతీలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● గత మున్సిపల్ ఎన్నికల సమయంలో..

నాలుగేళ్ల క్రితం పెద్దపల్లి మున్సిపల్ ఎన్నికల సమయంలో వార్డుల విలీనం జరిగింది. అప్పటి మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీచేసిన వారు ఓటు వేయించుకొని చేతులు దులుపుకున్నారని, ఎన్నికలు తర్వాత తమను పట్టించుకునే వారే కరువయ్యారని ఆయా వార్డుల ప్రజలు వాపోతున్నారు. రెండు వార్డులోని సుమారు 40 ఇళ్ల వరకు పెద్దపల్లి మున్సిపల్‌లో విలీనం చేసినట్లు ప్రజలు పేర్కొంటున్నారు. ఎన్నికలు అయిన నాటి నుంచి వార్డుల్లో పారిశుధ్య చర్యలను పట్టించుకోలేదని, మున్సిపల్‌లో తమ వార్డులున్నాయో లేవోనని, పట్టించుకునే ప్రజాప్రతినిధులు, అధికారులు కరువయ్యారని పేర్కొంటున్నారు.

● నీటి నిల్వలు, ఏపుగా పెరిగిన ముళ్లపొదలు..

మున్సిపల్‌లో విలీనం అయిన వార్డుల్లో విపరీతంగా వర్షపు నీరు నిల్వడంతో పాటు, ఇళ్ల మధ్యనే ముళ్లపొదలు పెరిగాయి. మున్సిపల్ సిబ్బంది కనీసం అటువైపు వచ్చిన సందర్భాలు లేవని, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా



వార్డులోని మట్టి రోడ్డు

చర్యలు తీసుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. దోమల నివారణకు గ్రామ పంచాయతీలో ఉన్న వార్డుల్లో మాత్రమే ఫాగింగ్ చేశారని, తమ వార్డుల్లో ఇప్పటివరకు అలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ వార్డులను తిరిగి పెద్దబొంకూరు గ్రామపంచాయతీలో కలపాలని వారు కోరుతున్నారు.

● ప్రజలకు కనీస సౌకర్యాలు అందించాలి

- మిట్టపల్లి శ్రీనివాస్



విలీనం అయిన విషయం మున్సిపల్ ఎన్నికల సమయంలో తెలిసింది. ఎన్నికలు జరిగి ఏళ్ల గడుస్తున్నా ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. మున్సిపల్ కలిసిన వార్డుల్లోని ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాలి. వార్డులో దోమల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

● పంచాయతీలో ఉంటేనే ప్రశ్నించే అవకాశం..

- తగరం సుష్మిత



గ్రామ పంచాయతీలో ఉన్నప్పుడే వార్డుల్లో ఏదైనా సమస్యలుంటే అధికారులు చెబితే తక్షణమే పరిష్కారం చూపేవారు. కాని మున్సిపల్‌లో కలిశాక సమస్య చెప్పుకుందామంటే 5 కిలోమీటర్లు వెళ్లి మున్సిపల్ అధికారులను కలవాల్సిన వస్తోంది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

మంచం పట్టిన పెద్దబొంకూరు..

- ఇంటింటికీ జ్వరపీడితులు
- కీళ్లనొప్పులతో ప్రజల అవస్థలు



జ్వరంతో బాధపడుతున్న గ్రామస్థులు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 2 : మండలంలోని పలు గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. పెద్దబొంకూరులో ఏ ఇంట్లో చూసినా జ్వర పీడితులే కనిపిస్తున్నారు. అయినా అధికారులు చర్యలు చేపట్టడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. పరిశుభ్రత, పారిశుధ్యం కోసం శ్రద్ధ తీసుకున్న అధికారులు జ్వరాలు విజృంభిస్తున్నా పట్టించుకోని పరిస్థితి ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. గత 15 రోజులుగా గ్రామంలో జ్వరాలు ప్రబలుతున్నా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయడంలేదని, ఇప్పటికైనా అధికారులు వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరుతున్నారు.

నెలరోజులుగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్నా..

- కల్వల తిరుపతి గౌడ్, పెద్దబొంకూరు , గ్రామస్థులు



గత నెల రోజుల నుండి తీవ్ర జ్వరం, కీళ్ల నొప్పులు రావడంతో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నాను. గ్రామంలో జ్వరపీడితులు ఎక్కువగా ఉన్న ఇప్పటివరకు అధికారులు కన్నెత్తి కూడ చూడలేదు. జ్వర పీడితులు ఎక్కువగా కాకముందే సర్వే నిర్వహించిన హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలి.

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 3: ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వరదతాకిడికి బిల్ కలెక్టర్ చెప్యాల పవన్ మృతిచెందగా ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ ఆర్థిక సహాయం కింద రూ.5లక్షలు మృతుడి తల్లి స్వరూపకు అందజేశారు. అనంతరం కునారంలో చెరువులో పడి మృతిచెందిన మత్స్యకారుడు గోస్కుల కుమార్ కుటుంబానికి కూడా ప్రభుత్వ సహాయం కింద రూ.5 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలను పరామర్శించి తమవంతుగా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. బీఆర్ఎస్ చౌకబారు ప్రకటనలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, సింగిల్ విండో చైర్మెన్ చదువు రామచంద్రారెడ్డి, చేతి ధర్మయ్య, ఆ పార్టీ మండల అధ్యక్షుడు గాదనవేన సదయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి ఇంద్రకరణ్‌రెడ్డి, బంగారు రమేష్, సబ్బని రాజమల్లు, తులా మనోహర్‌రావు, అల్లం దేవేందర్, రానవేన శ్రీనివాస్, శివరామకృష్ణ, ఎండీ మునీర్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ఇటీవల కురిసిన వర్షాలకు వరదల్లో మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం రూ.25లక్షల నష్టపరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.



పవన్ తల్లికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

మండలకేంద్రంలో ఇటీవల వరదల్లో మృతిచెందిన పవన్ కుటుంబాన్ని, అదేవిధంగా పెట్రోల్ పోసుకుని మృతిచెందిన తూండ్ల శ్రీనివాస్ కుటుంబాలను కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వ లెక్కల ప్రకారం వరదలవల్ల 33మంది మృతిచెందారని, బాధిత రూ.25లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ గంట రాములుయాదవ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడిగా భాస్కర్

సుల్తానాబాద్, సెప్టెంబరు 3: సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కొమురవెల్లి భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వైశ్యాభవన్‌లో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కొమురవెల్లి రాంమూర్తి, కార్యదర్శిగా తొడుపునూరి రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా కొమురవెల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలిగా బాదం వాణి ఎన్నికయ్యారు. జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి లింగమూర్తి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 3 : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో కవిత అన్నారు. మంగళవారం మండలంలోని రాఘవపూర్ అంగన్‌వాడీ కేంద్రం-1లో పోషణ మహ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా సీడీపీవో హాజరయ్యారు. చిన్నారుల తల్లిదండ్రులకు పోషకాహార పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్ శ్రీదేవి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన సదస్సు

సుల్తానాబాద్, సెప్టెంబరు 3:సుల్తానాబాద్ మున్సిపాలిటీ విలీన గ్రామమైన పూసాల ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన పోషకాహార అవగాహన సదస్సును లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మాటేటి సంజీవ్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ ప్రారంభించారు. వంద మంది పిల్లలకు పండ్లు బిస్కట్ పాకెట్లను, పల్లిపట్టీలను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు వల్స నీలయ్య, సాంబమూర్తి, నాగమల్ల ప్రశాంత్ కుమార్, చకిలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ఓదెల, సెప్టెంబరు 3 : మండలంలోని గుంపులకు చెందిన మొగిలి అనే వ్యక్తికి మంగళవారం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు రూ.1.25 లక్షల విలువగల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంద మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

మంథని, సెప్టెంబరు 3: మంథని మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ఉన్న అక్రమ నిర్మాణాల పై విచారణ జరిప చర్యలు తీసుకోవాలని మాజీ ఉప సర్పంచ్, న్యాయవాది ఇనుముల సతీష్ మంగళవారం కమిషనర్ మల్లిఖార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. అక్రమ నిర్మాణాలపై తిరిగి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎన్‌హెచ్‌ఆర్ఎస్‌జేసీ జిల్లా అధ్యకుడిగా దేవదాస్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 3: నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ కమిషన్ జిల్లా అధ్యక్షులుగా సుల్తానాబాద్ మండలం కొదురుపాకకు చెందిన సంకెనపల్లి దేవదాస్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు మహ్బూబ్ రాయ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు దేవదాస్‌కు రాష్ట్ర అధ్యక్షుడు సర్వేందర్ నియామక పత్రం అందజేశారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 3 : మండలంలోని పలు గ్రామాల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్.స్వామి అన్నారు. మంగళవారం మండలంలోని బ్రాహ్మణపల్లి-రాగినేడు మధ్య కల్వర్టు వరదనీటి ప్రవాహంతో గుంత ఏర్పడగా గ్రామస్థులు, వాహనదారులు సమస్యను సోషల్ మీడియా ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్.స్వామి మట్టితో గుంత పూడ్చి వేయించారు.

గ్రామపంచాయతీని పరిశీలించిన ఎంపీడీవో

కమాన్‌పూర్, సెప్టెంబరు 3 : మండలంలోని జూలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఎంపీడీవో లలిత పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి అంబటి శంకర్, కారోబార్ బర్ల భూమయ్యలున్నారు.

జర్నలిస్టుల కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 3: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పెద్దపల్లి పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు పెర్క రమేష్ కుటుంబ సభ్యులకు పెద్దపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చింతకింది చంద్రమొగిలి, నారాయణదాస్ అశోక్ మంగళవారం రూ.16 వేలు ఆర్థిక సహాయాన్ని క్లబ్ సభ్యులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



నియామక ఉత్తర్వుల అందజేత



ఉత్తర్వులు అందిస్తున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి, సెప్టెంబరు 3: సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలో డిపెండెంట్లకు మంగళవారం నియామక ఉత్తర్వులను అందజేశారు. ఎంవీటీసీలో 48 రోజుల పాటు శిక్షణ పూర్తి చేస్తుకున్న 30కి ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అధికారి నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు సుదర్శనం, సునీల్‌ప్రసాద్, మల్లన్న, సునీల్‌కుమార్, క్రాంతి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ క్రీడా పోటీలు

రామగిరి, సెప్టెంబరు 3: సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ పరిధిలో వర్క్‌పీపుల్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంటల్ స్థాయి క్రీడాపోటీలను బుధవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు అధికార ప్రతినిధి సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాపోటీల్లో మార్పులు, చేర్పులు ఉంటే సమాచారం ఇస్తామని తెలిపారు.

ఏఐటీయూసీ నాయకుల తీరు సిగ్గుచేటు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 3: కార్మిక సమస్యలను పరిష్కరించలేని ఏఐటీయూసీ నాయకులు ఫ్లెడేల విషయంలో చేసిన ప్రకటన సిగ్గు చేటని సీఐటీయూ ఆర్జీ-2 సెక్రెటరీ కుంట ప్రవీణ్ ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం తెలియకుండా వాట్సాప్ గ్రూప్‌లో జరిగిన పోస్టింగ్‌పై ఏఐటీయూసీ నాయకులు ప్రకటనలు జారీ చేయడం సిగ్గుచేటని అన్నారు. యూనియన్లతో సంబంధం లేకుండా ఓసీపీ-3 కార్మికులు ఫ్లెడేలు బహిష్కరించారని, యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరించాల్సిన ఏఐటీయూసీ నాయకులు తామే ఫ్లెడేలు బహిష్కరించినట్లు ప్రకటించుకోవడం వారి నైతికతకు నిదర్శనమని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గుర్తింపు పత్రం తీసుకోకపోవడంతో యాజమాన్యం ఏఐటీయూసీని పట్టించుకోవడం లేదని, దీంతో కార్మికులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నట్లు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఇప్పటికైనా గుర్తింపు పత్రాన్ని తీసుకుని బాధ్యతాయుతమైన యూనియన్ నాయకులుగా నడుచుకోవాలని ప్రవీణ్‌కుమార్ సూచించారు.

గని కార్మికుల సమస్యలపై బీఎంఎస్ ఆందోళనలు

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 3: దేశ వ్యాప్త బొగ్గు గని కార్మికుల సమస్యలపై బీఎంఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేయనున్నట్టు సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. మంగళవారం వీకేపీ గనిలో జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సీఎంపీఎఫ్ భవిష్యనిధిలో జరిగిన వెయ్యి కోట్ల కుంభకోణంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 11వ వేజ్‌బోర్డులో జరిగిన ఒప్పందాలను అన్ని అమలు చేయాలని, అన్ని బొగ్గు సంస్థల్లో పారిశ్రామిక సత్సంబంధాలు ఒకే పద్ధతిలో అమలు చేయాలని సత్తయ్య డిమాండ్ చేశారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాల ని, అవసరమైన స్పెషలిస్టు వైద్యులను నియమించాలని, క్యాడర్ స్కీం మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఓవర్‌మెన్, మైనింగ్ సర్దార్, డాటా ఎంట్రీ ఆపరేటర్, బదిలీ వర్కర్ డిసిగ్నేషన్లు మార్చుటకు యాజమాన్యం ఆదేశించాలని డిమాండ్ చేశారు. గడిచిన ఆర్థిక సంవత్సర లాభాలను ప్రకటించి 40 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని సత్తయ్య డిమాండ్ చేశారు. బీఎంఎస్ చేపట్టనున్న



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

ఆందోళనలకు కార్మికులు మద్దతుగా నిలవాలని కోరారు. ఈగేట్‌మీటింగ్‌లో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ వడ్డెపల్లి కుమారస్వామి, నాయకులు సారంగపాణి, మాదాసి రవీందర్, ప్రమోద్‌కాషల్, యాదగిరి నరేష్, అబ్బోజు శివాజీ, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

అకారణంగా లెటర్లు జారీ చేయడం మానుకోవాలి : ఏఐటీయూసీ

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 3: సీహెచ్‌పీ కార్మికులకు అకారణంగా లెటర్లు జారీ చేయడం మానుకోవాలని ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్ అన్నారు. మంగళవారం సీహెచ్‌పీని ఏఐటీయూసీ బృందం పరిశీలించింది. కార్మికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. పని స్థలాలను తనిఖీ చేయకుండా నే కార్మికులకు లెటర్లు ఇవ్వడాన్ని ఖండిస్తున్నట్టు రవీందర్ తెలిపారు. ఆర్జీ-2 ఏరియాలో సేఫ్టీ అధికారులు కొందరు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, సీహెచ్‌పీలో అకారణంగా కార్మికులకు లెటర్లు జారీ చేయడాన్ని ఖండిస్తున్నట్టు తెలిపారు. కార్మికులకు నాణ్యమైన షూస్ ఇవ్వాలని, ఫ్లో ఫీడర్స్ జీఎల్ బంకర్ కార్మికులకు గమ్ షూస్ ఇవ్వాలని, వ్యాగన్ లోడింగ్ కార్మికులకు రెయిన్ కోట్లు, టెక్నీషియన్లకు నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీహెచ్‌పీని సందర్శించిన బృందంలో నాయకులు అన్నారావు, సాంబశివరావు, సెగ్గెం శంకర్, అల్లి రమేష్, శంకర్, రాజశేఖర్, కిషోర్‌బాబు ఉన్నారు.

శిక్షకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి, సెప్టెంబరు 3: నైపుణ్యాభివృద్ధి కోర్సుల శిక్షకురాలిగా పని చేయడానికి ఆసక్తిగల మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పర్సనల్ మేనేజర్ సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, జూట్ బ్యాగ్స్ తయారీలో శిక్షణ ఇచ్చేందుకు సింగరేణి ఉద్యోగుల కుటుంబ మహిళలు, పరిసర గ్రామాల మహిళల నుంచి దరఖాస్తులను కోరారు. దరఖాస్తుతోపాటు అనుభవ ధ్రువీకరణపత్రాలు, ఆధార్‌కార్డ్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను జతచేసి జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో అందించాలని సూచించారు.

శ్రమ దోపిడీకి గురవుతున్న కాంట్రాక్టు కార్మికులు

- కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి - మావోయిస్టు కోల్‌బెల్ట్ కార్యదర్శి ప్రభాత్

గోదావరిఖని, సెప్టెంబరు 3: సింగరేణిలో అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి కాంట్రాక్టు కార్మికులన శ్రమ దోపిడీకి గురిచేస్తున్నట్టు మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ కార్యదర్శి ప్రభాత్ ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ప్రభాత్ మంగళవారం మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఓపెన్‌కాస్టులు, భూగర్భ గనులతో పాటు వివిధ డిపార్ట్‌మెంట్లలో 29వేల మంది కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని, వారికి న్యాయమైన వేతనాలు, చట్టబద్ధంగా రావాల్సిన వసతులు అందడంలేదని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో సుశి ఓబీ కంపెనీ, సింగరేణి అధికారులు కలిసి 5కోట్ల పీఎఫ్ నిధులు స్వాహా చేయడం తీవ్రమైన ఆర్థిక దోపిడీగా ప్రభాత్ పేర్కొన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, కాంట్రాక్టు ముగిసినా, పనులు పూర్తయినా వాటిపై ఆధరపడిన కార్మికులు ఉపాధి లేక రోడ్డును పడుతున్నట్టు తెలిపారు. సింగరేణి యాజమాన్యం ప్రతిఏటా వేలకోట్లు లాభాలను ఆర్జిస్తూ, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై కంటితుడుపు చర్యలకు తీసుకుంటూ చేతులు దులుపుకుంటున్నట్టు ప్రభాత్ పేర్కొన్నారు. ఏదయినా ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోతున్న కాంట్రాక్టు కార్మికుల పట్ల యాజమాన్యం బాధ్యతారాహిత్యంగా వ్యవరిస్తున్నట్టు తెలిపారు. కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం హైపవర్ కమిటీ సూచించిన వేతనాలను అమలుచేయాలని, పూర్తి మస్టర్లు ఉండేలా పనులు కల్పించాలని, పీఎఫ్ నిధులను నెలనెలా చెలించి, చీటీలను వారికి అందజేయాలని ప్రభాత్ డిమాండ్ చేశారు. పనుల్లో పెట్టుకునే నెపంతో అక్రమ వసూళ్లకు పాల్పడడం కాంట్రాక్టర్లు మానుకోవాలని ఆయన సూచించారు. కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం పోరాటం దిశగా ఆలోచన చేయాలని ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

'సకాలంలో రుణాలు చెల్లించాలి'

సుల్తానాబాద్, సెప్టెంబరు3: సహకార సంఘాలలో రైతులు తీసుకుంటున్న దీర్ఘకాలిక రుణాలను తిరిగి సకాలంలో చెల్లించాలని కేడీసీసీబీ అసిస్టెంట్ రిజిస్ట్రార్, జిల్లా సేల్ అధికారి వంశీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని చిన్నకలువల సహకార సంఘం పరిధిలో పలువురు రైతులు తనఖా పెట్టిన భూముల వేలం పాటలు నిర్వహించేందుకు నిర్ణయించి మంగళవారం పాట పాడేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కానీ రైతులు మరికొంత గడుపు కావాలని కేడీసీసీబీని అభ్యర్థించడంతో వేలం పాటలను వాయిదా వేశామన్నారు. సుల్తానాబాద్ మండలంలోని సుల్తానాబాద్, చిన్నకలువల, కనుకుల, సుద్దాల సహకార సంఘాల పరిధిలో కొన్ని సంవత్సరాల నుంచి దాదాపు పది కోట్ల రూపాయలకు పైగా దీర్ఘకాలిక రుణాలు వసూలు కావాల్సి ఉందన్నారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించి సంఘాల అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. కొత్త సభ్యులకు కూడా రుణాలు ఇచ్చే అవకాశాన్ని తమకు కల్పించాలని వంశీకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీబీ మేనేజర్ శశిధర్, సీఈఓ వల్లంకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స కోసం రూ.50 వేలు అందజేత

సుల్తానాబాద్, సెప్టెంబరు 3: సుల్తానాబాద్ పట్టణానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు సిలువేరి మహేందర్ అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ఆసుపత్రి ఖర్చుల కోసం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి యాభై వేల రూపాయల చెక్కును అందజేశారు. సుల్తానాబాద్‌కు చెందిన మహేందర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. కొద్ది రోజుల క్రితం వైరల్ జ్వరానికి గురై ఆస్పత్రిలో చేరారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నేతలకు సన్మానం

మంథని, సెప్టెంబరు 3: కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ ఆధ్వర్యంలో స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో మంథని విశ్వబ్రాహ్మణ సంఘం (వోపా) నేతలకు మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. అధ్యక్షుడు కొమురోజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ముల్కల్ల రాజశేఖర్, గౌరవ అధ్యక్షుడు తంగళ్ళపల్లి మధూకర్, ఉపాధ్యక్షుడు బోనాల రవీందర్, కనపర్తి సత్యనారాయణను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అయిలి ప్రసాద్, వద్ల శ్రీనివాస్, ఐలి శ్రీనివాస్, సాదుల శ్రీకాంత్, గుండా రాజు, రామ్మూర్తి, కావేటి సమ్మయ్య, వంగల తిరుమలేష్, గొల్లపల్లి శ్రీనివాస్, గుండోజు ప్రవీణ్, రాజశేఖర్, కొరవేన కుమార్‌లు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం పట్టణ కార్యవర్గం రాజీనామా

మంథని, సెప్టెంబరు 3: మంథని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సముద్రాల సురేష్‌తో పాటు కార్యవర్గం మొత్తం తమ పదవులకు రాజీనామా చేసి సంఘం రాష్ట్ర కమిటీకి పంపగా వారు ఇంకా రాజీనామాలను ఆమోదించలేదని సంఘం నేతలు మంగళవారం తెలిపారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన నల్మాసు ప్రభాకర్ బాధ్యతలు తీసుకున్న తర్వాత మంథని పట్టణ మహాసభ కార్యదర్శి కొమురవెల్లి విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యవర్గం రాజీనామా చేసినట్లు తెలిపారు. త్వరలోనే ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో వొల్లాల సత్యనారాయణ, ముస్త్యాల దామోదర్, కొత్త శ్రీనివాస్, ఎల్లంకి వంశీ, ఒల్లాల నాగరాజు, రావికంటి మనోహర్, చందా ఈశ్వర్, రాచర్ల నాగరాజు, ఎల్లంకి కేదారి, కొమురవెల్లి దత్తు, రావికంటి చందు, మణికంఠ ప్రకాష్, దొంతుల మేఘశ్యాం, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

'రైతుల సంక్షేమాన్ని విస్మరించిన కాంగ్రెస్'



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

అంతర్గాం, సెప్టెంబరు3: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని విస్మరించిందని బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి అన్నారు. మంగళవారం రైతు సమస్యలపై రామగుండం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. సెప్టెంబరు వచ్చినా నేటికీ రైతులందరికీ రైతుబంధు డబ్బులు పంపిణీ చేయడం లేదని ఆరోపించారు. హైడ్రా పేరుతో హైదరాబాద్ చుట్టూ తిరుగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా జిల్లాలను పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోడకుంట సుభాష్, పిడుగు కృష్ణ, కోమళ్ల మహేష్, బాణాల స్వామి, బరుపటి నారాయణ, కొండపర్తి సంజీవ్, మిట్టపల్లి సతీష్ పాల్గొన్నారు.

'శిథిలావస్థలో ఉన్న ఇళ్లను కూల్చేయాలి'

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 3: కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా కూల్చివేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి, కమిషనర్ ఆకుల వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల కారణంగా 13వ వార్డులోని వైద్యుల చక్రపాణికి చెందిన శిథిలావస్థలో ఇల్లు కూలిపోయిందన్నారు. అదృష్టవశాత్తు పెనుప్రమాదం తప్పి ఎలాంటి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగలేదన్నారు శిథిలావస్థలో ఉన్న ఇండ్లు ఉంటే మున్సిపల్ సిబ్బందికి గాని హెల్ప్‌లైన్ నంబర్ 6303127484కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే జేసీబీ ద్వారా కూల్చివేస్తామన్నారు. ఎలాంటి నష్టాలు జరగకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని వారు కోరారు. వర్షాల కారణంగా విష జ్వరాలు ప్రబలకుండా ఇంట్లో వర్షపు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ భూతగడ్డ సంపత్, టౌన్ ప్లానింగ్ అధికారి వినయ్, మున్సిపల్ సిబ్బంది వెంకటేష్, శంకర్,భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 3: గోదావరిఖని కాకతీయనగర్‌లో మంగళవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావుల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికి తిరుగుతూ బీజేపీ సభ్యత్వా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అన్ని రాజకీయ పార్టీలలో బీజేపీకి అత్యధిక సభ్యత్వం కలిగి ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంతో పాటు రామగుండం నియోజకవర్గంలో అత్యధిక సభ్యత్వం చేయించడమే లక్ష్యం అన్నారు. మాతంగి రేణుక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మామిడి రాజేష్, కొమ్మ శ్రీనివాస్, మామిడి సంపత్, అడ్డూరి రాజేష్, మంద శ్రీనివాస్, కుమ్మరి మల్లేష్, సల్ల వేణు రెడ్డి, దుబ్బసి లక్ష్మణ్, వడ్లూరి రాము, బొల్లా మోహన్, ఉప్పరి మల్లమ్మ, ఉమ రాణి, బొల్లా లక్ష్మి, రాజమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

రామగిరి, సెప్టెంబరు 3: మండలంలోని ప్రగతి పాఠశాల ఆవరణలో మంగళవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, గౌరవ సలహాదారు నూకా రమేశ్ విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గంటవెంకటరమణరెడ్డి, నాయకులు నల్లవెల్లిశంకర్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 3: మండలంలోని పందిళ్ళ గ్రామానికి చెందిన చిలుముల అంకుష్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులకు మాజీ జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి బియ్యంతో పాటు రూ.2వేల ఆర్థిక సహాయం పంపించగా బీఆర్ఎస్ నాయకుల అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ధర్మాల రవి రామస్వామి, రామమూర్తి, లక్ష్మణ్, రమేష్, రవి, మహేష్, కిరణ్, శ్రీకాంత్ ఉన్నారు.